## బాబు మధ్యంతర బెయిల్‌పై నేడు తీర్పు!

హైదరాబాద్, అక్టోబర్ 30 (నమస్తే తెలంగాణ): చంద్రబాబు నాయుడు దాఖలు చేసిన మధ్యంతర బెయిల్ పిటిషన్‌పై తీర్పును హైకోర్టు రిజర్వ్ చేసింది. తమ నిర్ణయాన్ని మంగళవారం వెల్లడిస్తామని న్యాయమూర్తి పేర్కొన్నారు. చంద్రబాబు తరపున న్యాయవాది శ్రీనివాస్‌తోపాటు.. మరో సీనియర్ న్యాయవాది సిద్ధార్థ లూథ్రా వర్చువల్‌గా హైకోర్టులో వాదనలు వినిపించారు. రాష్ట్ర ప్రభుత్వం తరపున ఏఏజీ పొన్నవోలు సుధాకర్‌రెడ్డి కోర్టుకు హాజరయ్యారు.

### చంద్రబాబుపై సీఐడీ మరో కేసు

చంద్రబాబుపై ఏపీ సీఐడీ మరో కేసు నమోదు చేసింది. మద్యం కంపెనీలకు అక్రమంగా అనుమతి ఇచ్చారన్న ఆరోపణలపై పీసీ యాక్ట్ కింద ఈ కేసు నమోదైంది. ఏసీబీ కోర్టుకు ఎఫ్ఐఆర్ కాపీ అందింది.

## పత్తి క్వింటాల్ @ 7,130

కాశీబుగ్గ, అక్టోబర్ 30: వరంగల్ ఎనుమాముల వ్యవసాయ మార్కెట్‌లో సోమవారం పత్తి ధర క్వింటాల్‌కు రూ.7130 పలికింది. భారత ప్రభుత్వ మద్దతు ధర క్వింటాల్‌కు రూ.7,020 ఉండగా ఇక్కడ రూ.110 అధికంగా పలికింది. మార్కెట్‌కు మొత్తం 5,772 బస్తాలు వచ్చాయని, అత్యధికంగా మొదటి రకం పత్తికి క్వింటా రూ.7,130, మధ్యరకానికి రూ.7,100, కనిష్ఠంగా రూ.5,600 పలికినట్టు పత్తి యార్డు సూపర్‌వైజర్ గంగాధర్ తెలిపారు. వరంగల్ జిల్లా సంగెం మండలం నార్లవాయి గ్రామానికి చెందిన కుసం స్వామి మార్కెట్‌కు 21 పత్తి బస్తాలు తీసుకొచ్చాడు.
















